సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 27 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 08.05.2025




## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2 లో

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్



2 లో



## యుద్ధంలో పాల్గొనేందుకు మేం సిద్ధం

- మాజీ సైనిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి

3 లో


wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com


8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

General News




# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థినీ విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ తో కలిసి కలెక్టర్ ఎస్ఎస్సీ 2025లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విజయోస్తు సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఎస్సీ 2025 పది ఫలితాల్లో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మూడో స్థానంలో నిలవటం ఎంతో గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని 129 పాఠశాలలు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించి, జిల్లాను అగ్రభాగాన నిలబెట్టారని వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, మండలాల నోడల్ అధికారులు విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించి, వారు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేసి, కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్మార్ట్ లెర్నింగ్ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో దోహదపడిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, ప్రతి విద్యార్థిని ముందుకు తీసుకువెళ్లే బాధ్యత కూడా హెడ్ మాస్టర్లకు ఉందని, పదో తరగతి తర్వాత విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకోవాలని తికమక పడుతుంటారని, ఆ సమయంలో తమ ఆర్థిక స్తోమత, ఏ రంగంపై గల ఆసక్తి, డిమాండ్ వంటి వాటిని దృష్టిలో ఉంచుకొని జీవన ప్రగతిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అదే విధంగా తల్లిదండ్రులు విద్యార్థినులను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను జిల్లా యంత్రాంగం తరఫున ఎంతగానో అభినందించారు. అనంతరం జిల్లా రైస్ మిలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిచే పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 23 మంది విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో పాటు సైకిల్ లను బహుమతులుగా అందజేశారు. అలాగే 129 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించారు. అంతకుముందు ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు పాఠశాలల ఎంఈఓలు, అదే విధంగా ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులైన పలువురు విద్యార్థినీ విద్యార్థులు తమ సందేశాలతో హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఈవో భోజన్న, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, డీఐఈఓ జితేందర్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, అన్ని మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

















# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- **గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్**

**జనగామ, మన చౌరాస్తా :** నిరుపేదలైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ వి.పి గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అలాగే దరఖాస్తుదారుల పరిశీలన ప్రక్రియపై అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏఈలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉండాలని, ఇందిరమ్మ ఇళ్లు 600 స్క్వేర్ ఫీట్ కన్నా ఎక్కువ కాకుండా, 400 స్క్వేర్ ఫీట్ కన్నా తక్కువ కాకుండా ఇళ్లు నిర్మించాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఒక దఫా డబ్బులు కూడా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అయ్యిందన్నారు. ఇళ్ల నిర్మాణానికి నూతన పద్ధతులు (కొత్త టెక్నాలజీ) లను ఉపయోగించాలని, వాటిపై అవగాహన పెంపొందించాలని సూచించారు. ఒకటో విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి బాగుందని, పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని, ఎప్పటికప్పుడు సర్వే చేసిన వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల అర్హుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ మిషన్ కింద పైలట్ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల మంజూరుకు పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలన్నారు. అంతకుముందు జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ తో కలిసి గౌతమ్ పరిశీలించారు. అలాగే జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 1 లో, లింగాల ఘనపురం మండలంలోని వనపర్తి గ్రామంలో నిర్వహిస్తోన్న రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో గల మోడల్ ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపీరాం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య కుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

# వల్మిడి హుండీ ఆదాయం రూ.97 వేలు



**పాలకుర్తి, మన చౌరాస్తా:** వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.97,143 వచ్చినట్లు ఈవో సల్వాది మోహన్ బాబు తెలిపారు. 2025 మార్చి 21 నుంచి మే 7 వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, 48 రోజుల ఆదాయాన్ని బుధవారం ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉప్పలమ్మ టెంపుల్ ఈవో కేకే రాములు పర్యవేక్షణలో లెక్కించారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# యుద్ధంలో పాల్గొనేందుకు మేం సిద్ధం

- భారత ఆర్మీ ఎప్పుడు పిలిచినా వస్తాం
- 'ఆపరేషన్ సింధూర్' మనకు పండుగ దినం
- మాజీ సైనిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి

**జనగామ, మన చౌరాస్తా:** పాకిస్తాన్ తో ఏ క్షణంలో యుద్ధం ఏర్పడినా ఆ యుద్ధంలో పాల్గొనేందుకు మాజీ జవాన్లం సిద్ధంగా ఉంటామని మాజీ సైనిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కర్నల్ మాచర్ల భిక్షపతి ప్రకటించారు. ఉగ్రమూకలను తుద ముట్టించేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ మనకు పండుగ దినమని ఆయన అన్నారు. బుధవారం జనగామ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్ర చర్యల వల్ల ప్రస్తుతం యుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయని, భారత సైన్యానికి తోడుగా తాము బ్యాగులు సర్దుకొని సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల పహల్గాంలో టెర్రరిస్టులు పాశవిక దాడి చేసి అమాయకుల సింధూరాలను దూరం చేశారని, అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం పాకిస్తాన్లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. పహల్గాం ఘటన జరిగిన 15 రోజుల్లోనే భారత రక్షణ దళం వందల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టడం అభినందనీయమన్నారు. ఉగ్రవాదాన్ని పాతాళానికి తొక్కడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై ప్రపంచ దేశాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ హాస్పిటల్ ఎండీ జైన రమేశ్, మాజీ సైనిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రవీందర్రెడ్డి, కోశాధికారి యూసుఫ్, సభ్యులు కుమార్యాదవ్, వెంకన్న, ప్రభాకర్, డాక్టర్ గౌతంరెడ్డి, బద్రీనాథ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



## సకాలంలో ధాన్యం తరలించాలి

### అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్


**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్స్ తో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ బ్యాగులను సరైన విధంగా నిర్వహించాలన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి సమస్య రాకుండా చూడాలని రైస్ మిల్లర్లను కోరారు. అలాగే ఎక్కడైనా ధాన్యం కొనుగోళ్లలో తరుగు, తదితర అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలను సకాలంలో పంపి ధాన్యం తరలించాలని సూచించారు. ఎటువంటి ఆలస్యం చేయరాదన్నారు. సమావేశంలో డీసీఎస్ఓ సరస్వతి, డీఎం సీఎస్ హాతీరాం, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, రైస్ మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్స్ పాల్గొన్నారు.



## 'సింధూర్'కు మద్దతుగా జాతీయ జెండాల ప్రదర్శన

**జనగామ, మన చౌరాస్తా:** పాకిస్తాన్ ఉగ్ర సంస్థలపై భారత రక్షణం చేపట్టిన ఆపరేషన్ సింధూర్కు మద్దతుగా ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామలో బుధవారం జాతీయ జెండాలు ప్రదర్శించి మద్దతు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ప్రీతి దయాళ్ పాల్గొని మాట్లాడారు. సైనికులకు మద్దతుగా ఎర్త్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు, ముద్రబోయిన రాజు, ఆంజనేయులు, నల్ల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటా..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా:** బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం జనగామలోని ధర్మకంచలో జరిగిన పానుగంటి ప్రవీణ్ దశదిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రవీణ్ బీఆర్ఎస్ బలోపేతానికి చేసిన కృషిని గుర్తు చేశారు. అనంతరం తన తరఫున రూ. 2లక్షలు, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి తరఫున రూ. లక్షతో పాటు పలువురు నాయకులు చేసిన ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు.



## వైభవంగా ఆరాధన మహోత్సవం

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆంజనేయ స్వామి దేవస్థానంలో కొలువైన గోవిందామాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన(జయంతి) మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు పారునంది శ్రీనివాస్ శర్మ అభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు దీగోజు విజయనరసింహ చారి, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దీగోజు అనిత సాంబాచారి, ఉపాధ్యక్షులు బత్తోజు మహేశ్వరి సిద్ధిరాములు, సంఘ పెద్దలు మైలారం రేణుక దామోదరచారి, చెల్లోజు కీర్తన నవీన్ చారి, మంద్రోజు ఉమారాణి కర్ణాకర్ , కాసోజు జ్యోతి సంతోష్, ముమ్మాడి సంతోషిని గణేష్ పాల్గొన్నారు.



## కన్యకా పరమేశ్వరికి కలశాభిషేకం

**జనగామ, మన చౌరాస్తా:** శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మాతా జయంతి సందర్భంగా జనగామలోని అమ్మవారి ఆలయంలో కృష్ణమాచార్య సిద్ధాంతి మేళ్ళచెరువు అప్పయ్య శాస్త్రి నాగరాజు, అవ్వారు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం 101 కళాశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సువర్ణ పుష్పాలతో అర్చన, హోమం చేశారు. 251 మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పజ్జూరి గోపయ్య, ప్రధాన కార్యదర్శి బుద్ధా రమేష్, కమిటీ సభ్యులు పుల్లూరు శ్రీనివాస్, మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, బిజ్జాల నవీన్ కుమార్ గుప్తా, అరుగుల శ్రీనివాస్, సోమరాజు, గంగిశెట్టి మంజునాథ్, నంగునూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.